క్లుప్తంగా

తాగునీటి పైప్‌లైన్ మంజూరు చేయాలని వినతి

రామవరప్పాడు : కృష్ణానది నుంచి తాగునీటి పైప్‌లైన్‌ను విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామానికి మంజూరు చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్ మంగళవారం నిజాంపట్నంలో జరిగిన మత్స్యకార భరోసా కార్యక్రమంలో పాల్గొన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సుమారు మూడు వేల మంది జనాభా నివసిస్తున్నారన్నారు. పంచాయతీ ద్వారా సరఫరా చేసే తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని చంద్రశేఖర్.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి పైప్‌లైన్‌ను గ్రామానికి మంజూరు చేసి నీటి ఇక్కట్లను పరిష్కరించాలని కోరారు.

ముగ్గురిపై దాడి కేసు

పెనమలూరు: యువతిని వేధిస్తూ ఆమె ఇంటిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక శ్రీనగర్‌కాలనీ కందులవారి వీధిలో మండూరి రమేష్ కుటుంబం నివసిస్తోంది. అతను గ్లాస్ వర్క్ చేస్తుంటాడు. అతనికి ముగ్గురు సంతానం. రెండు రోజుల క్రితం రాత్రి మండూరు రమేష్ ఇంటి వద్దకు ముగ్గురు వ్యక్తులు వచ్చి రాళ్లతో ఇంటి కిటికీ అద్దాలు పగలకొట్టారు. అతను బయటకు వచ్చి చూడగా అక్కడ రమేష్ అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరు ఉన్నారు. ఆ ముగ్గురూ రమేష్‌పై దాడి చేశారు. కుటుంబ సభ్యులను బెదిరించారు. గతంలో మండూరి రమేష్ కృష్ణలంకలో ఉన్నప్పుడు రమేష్ అనే వ్యక్తి అతని కుమార్తె వెంటపడి వేధించడంతో పెద్దల సమక్షంలో మందలించారు. ఈ నేపథ్యంలో దాడి జరిగిందని ఎం.రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అత్తింటివారిపై వేధింపుల కేసు

పెనమలూరు: అత్తింటివారిపై మంగళవారం వరకట్న వేధింపుల కేసు నమోదైంది. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడపకు చెందిన పులివర్తి నాగరమ్య రెండేళ్ల క్రితం కల్యాణ్‌కుమార్‌ను పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. ఆ సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. ఆమె భర్త హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి. అయితే భర్తతో పాటు అత్త జయమ్మ, మామ సాయిబాబు, ఆడపడుచు పూర్ణ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

డీలర్‌షిప్ ఇప్పిస్తానని రూ. 8.50 లక్షల మోసం

పెనమలూరు: రైస్ డీలర్‌షిప్ ఇప్పిస్తానని మహిళను మోసం చేసిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పటమట అయ్యప్పనగర్‌కు చెందిన గుడిసేవ లక్ష్మి పోరంకిలోని ఓ రైస్ షాపులో బియ్యం కొంటూ ఉంటుంది. ఆమెకు షాపులో ఉన్న అబ్బాబత్తుల కోటేశ్వరరావు పరిచయమయ్యాడు. తాను బ్రాండ్ డీలర్‌షిప్ ఇప్పిస్తానని కోటేశ్వరరావు, అతని కుమారుడు నవీన్ కలిసి నమ్మించి లక్ష్మి నుంచి పలు సార్లుగా రూ. 8.50 లక్షలు సొమ్ము తీసుకున్నారు. అయితే వారు డీలర్ షిప్ ఇప్పించకపోవడంతో లక్ష్మి తన సొమ్ము తిరిగి ఇవ్వాలని కోరింది. తండ్రీకొడుకులు ముఖం చాటేయడంతో బాధితురాలు పోలీసును ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్బీకేల్లో పంట నష్టం వివరాలు

- 428 ఎకరాల పంట నష్టం
- సచివాలయాల్లోనూ చూసుకోవచ్చు

పెనమలూరు: అకాల వర్షాలతో నష్టపోయిన పంటల వివరాలను అధికారులు నమోదు చేశారు. రైతుల వివరాలను సంబంధిత సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రకటించారు. మండలంలో కురిసిన వర్షాలకు మొత్తం 428 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ చేసి గుర్తించారు. పంట నష్టం పరిశీలించాలని ప్రభుత్వ ఆదేశాలతో ఉన్నతస్థాయి అధికారులతో పాటు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, జిల్లా, మండల స్థాయి అధికారులు విస్తృతంగా పర్యటించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నష్టం జరిగిన పంటల వివరాలు

మండల పరిధిలో కురిసిన భారీ వర్షాల కారణంగా జరిగిన పంటల నష్టం వివరాలను అధికారులు మంగళవారం ప్రకటించారు. పంటలు 33 శాతానికి పైగా నష్టం జరిగితేనే వాటిని పరిహారం నిబంధనల ప్రకారం ఇవ్వనున్నారు. పంట నష్టం వివరాలు ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రకారం ఇలా ఉన్నాయి. మొక్కజొన్న 30.93 హెక్టార్లు. హెక్టారుకు పరిహారం రూ 12,500, జొన్న 100.84 హెక్టార్లు, పరిహారం హెక్టారుకు 6,800, ధాన్యం 39.62 హెక్టార్లు. హెక్టారుకు



వణుకూరులో ఎండబెట్టిన మొక్కజొన్న

రూ.15,000 చొప్పున పరిహారం అందజేస్తారు. మొత్తం మండలంలో 168 మందికి పంట నష్టం అందుతుంది. అధికారులు ప్రకటించిన వివరాలను సామాజిక తనిఖీ కోసం ప్రకటించారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 16 నుంచి 20వ తేదీ లోపు అధికారులు దృష్టికి తీసుకెళ్లాలి.

800 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు

మండల పరిధిలో నష్టం జరిగిన మొక్కజొన్న 800 క్వింటాళ్లను ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు చేసింది. మార్కుఫెడ్ ఆధ్వర్యాన మండల పరిధిలో మొక్కజొన్న కొనుగోళ్ల కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయగా ఎమ్మెలే కొలుసు పార్థసారథి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. మండలంలో ఆరు గ్రామాల నుంచి రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకాలు చేశారు. క్వింటాకు రూ .1,962 ధరను ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుంది.

అభ్యంతరాలు ఉంటే చెప్పాలి

పంట నష్టం పై పూర్తిస్థాయిలో ఎన్యూమరేషన్ చేశాం. ఈ నెల 20వ తేదీ వరకు రైతుల అభ్యంతరాలను తమ దృష్టికి తీసుకురావాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు నష్టపరిహారం అందుతుంది.

– కనకమేడల శైలజ,
మండల వ్యవసాయాధికారి,పెనమలూరు.

దోమల నిర్మూలనతో డెంగీ దూరం

కంకిపాడు, ఉయ్యూరులో ర్యాలీలు

ఉయ్యూరు: దోమల నిర్మూలనతో డెంగీ దరిచేరదని మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన మంగళవారం ఉయ్యూరులో జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి డెంగీపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, డాక్టర్ తేజస్విని, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. మండలంలోని కాటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దీప, వైద్య సిబ్బంది నాగార్జునబాబు, రత్నబాబు, సిబ్బంది పాల్గొన్నారు. చిన ఓగిరాల పీహెచ్‌సీ పరిధిలో వైద్యులు రాకేష్ అనిల్, శ్వేత అవగాహన కల్పించారు.

కంకిపాడు: ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యాన అన్ని గ్రామాల్లోనూ జాతీయ డెంగీ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఉప్పలూరులో నిర్వహించిన ర్యాలీని డాక్టర్ సుందర్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సంతోషచంద్రిక, హెల్త్ సూపర్‌వైజర్ శారమ్మ, ఆంజనేయులు, రామారావు, హెల్త్ అసిస్టెంట్లు రాచమళ్ల శ్యాంప్రసాద్, కెనడీ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న చైర్మన్ నాని, మునిసిపల్ సిబ్బంది

మినీ ఫుట్‌బాల్ పోటీలకు 'నలంద' విద్యార్థులు

కంకిపాడు: జాతీయ స్థాయి మినీ ఫుట్‌బాల్ పోటీలకు ఈడుపుగల్లు నలంద పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి మంగళవారం ఆ స్కూల్ ఆవరణలో అభినందించారు. ఆమె మాట్లాడుతూ మార్చి 25, 26 తేదీల్లో చిత్తూరు జిల్లా మదనపల్లిలో రాష్ట్రస్థాయి మినీ ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారన్నారు. పోటీల్లో కృష్ణా జిల్లా నుంచి పలువురు నలంద విద్యార్థులు ప్రాతినిధ్యం వహించారన్నారు. అండర్–14 విభాగంలో పి.వెంకట్, ఎండీ ఖాన్, ఎం.రాజేష్, వి.జైసూర్య, అండర్–17 విభాగంలో సీహెచ్ జాషువ, బి.భార్గవ్, ఎ.హర్షిత్, ఎం.ఫణీంద్ర ఎంపికయ్యారన్నారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ యూపీలోని జాన్ మిల్టన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు.



ఎంపికైన క్రీడాకారులతో నలంద ప్రిన్సిపాల్ జె.పద్మావతి

ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలతో ఆదాయం

డీపీఓ నాగేశ్వర నాయక్

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలను సక్రమంగా నిర్వహిస్తే అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ తెలిపారు. బాపులపాడులోని ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ పరిశీలించారు. గ్రామంలోని ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ప్రాసెసింగ్ కేంద్రాల షెడ్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఈ కేంద్రంతో కంపోస్ట్ ఎరువుల ఉత్పత్తి ద్వారా ఏడాదికి రూ.12 లక్షల ఆదాయం సమకూర్చుకోవడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎంపీడీఓ కె.ప్రభాకరరావు, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పంచాయతీ కార్యదర్శి సీవీఎల్ఆర్వీ ప్రసాద్, క్లాప్ మిత్రలు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



బాపులపాడులో ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

గన్నవరం రూరల్: బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యతని చైల్డ్ రైట్స్ ఆర్గనైజేషన్ కో–ఆర్డినేటర్ సీహెచ్ ప్రభాకర్ చెప్పారు. మంగళవారం మండలంలోని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బాలల హక్కులు వివరించారు. సమాజంలో బాధ్యతగా ఉండలని, పెద్దలను గౌరవించాలన్నారు. లైబ్రేరియన్ కె.కృపానందం, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం కిట్లు

గన్నవరం రూరల్: హెచ్‌ఐవీ బాధితులను ఆదుకోవడానికి అందరూ సహకరించాలని మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్ కోరారు. స్థానిక ఆస్పత్రిలో మంగళవారం దాతలు రవికుమార్, సుధా రాణి, రిషిత అందజేసిన నిత్యావసరాల కిట్లు 25మంది హెచ్‌ఐవీ బాధితులకు పంపిణీ చేశారు. డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కల్యాణి శ్రీ, ఏఆర్టీ డాక్టర్ భవాని, డాక్టర్ భగవాన్, కె.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పన్నులు వసూలు చేయాలి

ఉంగుటూరు: గ్రామాల అభివృద్ధికి దోహదపడే పంచాయతీల పరిధిలోని గృహ, వాణిజ్య పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బి.నాగేశ్వర్‌నాయక్ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్వామిత్ర సర్వే, పన్నుల వసూలు, జగనన్న స్వచ్ఛ సంకల్పంపై పలు గ్రామాల కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయాలన్నారు. నూటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాలని, గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేష గిరిరావు, ఈఓపీఆర్డీ బాషా, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి నున్నలోని పలు సెంటర్లలో వాణిజ్య వర్తక మండలి విభాగ మాజీ అధ్యక్షులు కొప్పురావూరి శోభనచలపతిరావు జ్ఞాపకార్థం మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. విజయవాడ– నూజివీడు మార్గంతో పాటు పలు సెంటర్లలో మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో కలకోటి శ్రీనివాసరెడ్డి, మణి, శివారెడ్డి, గంపా శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో గ్రామాలు

ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనతో గ్రామాలను ప్రగతిపథంలో నడిపిస్తున్నారని పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి చెప్పారు. మండలంలోని మద్దూరులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు గోసాల నుంచి మద్దూరు గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని అభివృద్ధి చేస్తే రాకపోకలు సజావుగా సాగుతాయని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అంతర్గత రోడ్లలో డ్రెయినేజీ వసతి కల్పన, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సమస్యలపై స్థానికంగా అధికారులతో సమీక్షించి, తగిన ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆయా కుటుంబాలకు అందిన పథకాలపై సంక్షేమ బ్రోచర్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులను పక్కనపెట్టి ప్రభుత్వం సంక్షేమాన్ని కొనసాగిస్తోందన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, పాల సేకరణ యూనిట్ల స్థాపనతో పాలనను క్షేత్రస్థాయికి తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. ఆపద సమయంలో రైతులను పూర్తి స్థాయిలో ఆదుకుంటూ మద్దతు ధర కల్పించడానికి కృషి చేస్తుంటే అభూత కల్పనలతో విష ప్రచారం చేస్తున్న ఘనత ప్రతిపక్షాలు, ఎల్లో మీడియాకే చెల్లుతుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి బాసటగా నిలిచి.. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, నాయకులు ఒడుగు ఆంజనేయులు, పోతాబత్తిన నాగార్జున, అరవపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో ప్రభుత్వ సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



ఉయ్యూరు గ్రంథాలయంలో లెమన్ అండ్ స్పూన్ ఆడుతున్న చిన్నారులు



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో..

ఉయ్యూరు: గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో మంగళవారం ఉత్సాహంగా ఆటల పోటీలు సాగాయి. ఉయ్యూరు గ్రంథాలయంలో మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ వంటి ఆటల పోటీలతో సందడి చేశారు. పోటీలను గ్రంథాలయాధికారి పి.రమణి, బి.డి.సి. సోని, స్రవంతి పర్యవేక్షించారు. కాటూరు గ్రంథాలయంలో జరుగుతున్న తరగతులను గ్రంథాలయాధికారి షాలార్ షరీఫ్ పర్యవేక్షించారు.

కంకిపాడు: మండలంలోని తెన్నేరు శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో పొడుపు కథలు చెప్పడం, కథలు చదివించడం, భగవద్గీత శ్లోకాల పఠనం, శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఔత్సాహిక విద్యార్థులకు చెస్, క్యారమ్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయ కమిటీ సభ్యురాలు నాదెండ్ల సాయిలీల కౌమార దశలో శరీరంలో ఏర్పడే మార్పులు, మంచి, చెడు ప్రవర్తనపై అవగాహన కల్పించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు పిల్లలకు కథలు చదివి వినిపించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి రామకృష్ణ పర్యవేక్షించారు.

ట్రాన్స్‌ఫార్మర్స్ సర్వీస్ కంపెనీలో చోరీకి విఫలయత్నం

గన్నవరం: మండలంలోని సూరంపల్లి శివారు రామచంద్రపురంలో ఉన్న ట్రాన్స్‌పార్మర్స్ వర్కషాపులో ఓ దొంగల ముఠా చోరీకి విఫలయత్నం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. రామచంద్రపురంలోని చంద్ర ఎలక్ట్రికల్ అండ్ రివైండింగ్ సర్వీసెస్ కంపెనీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన ట్రాన్స్‌పార్మర్లకు మరమ్మతులు చేస్తుంటారు. ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి సుమారు పది మంది సభ్యులున్న దొంగల ముఠా కంపెనీ గోడ దూకి లోపలికి వచ్చింది. వారు సీసీ కెమెరాల వైర్లు కత్తిరించడం, కెమెరాలను పైకి తిప్పడంతో పాటు కిటికీ అద్దాలను పగలకొట్టి లోపలికి ప్రవేశించడానికి ప్రయత్నించారు. అక్కడ పని చేసే వర్కర్లు అప్రమత్తమై కంపెనీ యాజమాని చంద్రరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో చంద్రరావు అక్కడికి చేరుకోవడం.. సిబ్బందిని గమనించిన దొంగలు పరారయ్యారు. సంస్థ యజమాని ఫిర్యాదుతో తొలుత సున్న పోలీసులు అక్కడికు చేరుకుని పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేదు. అనంతరం గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్రైం సిబ్బంది అక్కడికి చేరుకుని సీసీ ఫుటేజ్‌ను సేకరించారు. దొంగలను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.



దొంగలు ధ్వంసం చేసిన కిటికీ అద్దాలు

జ్వరాలపై ఆందోళన వద్దు

జిల్లా మలేరియా అధికారి రామారావు

తోట్లవల్లూరు: జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి బి.రామారావు తెలిపారు. తోట్లవల్లూరు శివారు కలాసుమాలపల్లిలో మంగళవారం ఆయన పర్యటించారు. ఆరోగ్య సిబ్బంది మూడు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు ప్రబలాయన్న ప్రచారంపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న ఆధ్వర్యంలో జరిపిన ఇంటింటి ఫీవర్ సర్వేలో కేవలం ఒక్కరు మాత్రమే జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. తాగునీటిని క్లోరినేషన్ చేయటంతోపాటు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామారావు పేర్కొన్నారు. సబ్ యూనిట్ అధికారి శ్రీనువాసు, సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓలు మాణిక్యం, పీవీ శ్రీధర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కాలువ కట్టను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామారావు, డాక్టర్ సాయిప్రసన్న

రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 37 మందికి ఉద్యోగాలు

గన్నవరం: కేసరపల్లిలోని ఎస్ అర్బన్ ఐటీ సిటీలో రెండు రోజుల పాటు జరిగిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 37 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జరిగిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ముగింపు కార్యక్రమంలో ఆయన ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నిర్మన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫస్ట్ సోర్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు చెప్పారు. డ్రైవ్‌కు హాజరైన అభ్యర్థుల్లో మెరిట్ ఆధారంగా 37 మందిని ఎంపిక చేసి నియామక ఉత్తర్వులను అందజేసినట్లు తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ నియామక కార్యనిర్వాహకులు తుర్లపాటి మధు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సోమశంకర్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు హరిహరన్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ ఘటనపై కేసు

కంకిపాడు: తాళం వేసి ఉన్న ఇల్లు లక్ష్యంగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు పట్టణంలో దరిసి శివకుమార్ కుటుంబం నివసిస్తోంది. శివకుమార్ కోలవెన్ను గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 13న బంధువుల ఇంట్లో కార్యక్రమం నిమిత్తం కుటుంబం మొత్తం ఊరెళ్లారు. ఈ నెల 16న వచ్చి చూసే సరికి తలుపు తాళాలు పగలకొట్టి ఉండటం, బీరువాలో సామగ్రి చిందరవందరగా పడేసి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. బీరువాలో ఉన్న వస్తువులు పరిశీలించి 12 కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. కంకిపాడు పోలీసులకు సమాచారం అందించారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య, ఇన్‌చార్జి సీఐ కనకారావు, ఎస్ఐ కె.సుధాకర్ బృందం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించింది. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు ఘటనాస్థలంలో పలు ఆధారాలు సేకరించాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు.


తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

గుడివాడరూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఈవోపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తటివర్రు పంచాయతీని మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామ ప్రధాన తాగునీటి చెరువును పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సరఫరాపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో తాగునీటిని జాగ్రత్తగా వాడుకోవాలని ప్రజలకు సూచించారు. సిబ్బంది తాగునీటి సరఫరాపై దృష్టిపెట్టి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్‌పీ కృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతో ఉపాధి కరువు

బుద్ధవరం(గన్నవరం): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేదలకు ఉపాధి కరువవుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వై. నరసింహారావు పేర్కొన్నారు. బుద్ధవరం గ్రామంలో ఉపాధి, వ్యవసాయ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధి కూలీకి ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించడంతో పాటు రోజు వేతనం రూ. 600కు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు మల్లవల్లి ఆంజనేయులు, బడుగు మరియదాసు, గండికోట దొరబాబు, నక్కా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్ మృతి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తుండగా విద్యుత్ ఘాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎనర్జీ అసిస్టెంట్ షేక్ అమీర్ బాషా (32) మృతి చెందాడు. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్ (జూనియర్ లైన్‌మెన్)గా విధులు నిర్వహిస్తున్న షేక్ అమీర్ బాషా ఇటీవల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నారు. ఆ సమయంలో విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. ఆయన్ను హుటాహుటిన విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం షేక్ అమీర్ బాషాను గుంటూరులోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బాషాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతిపై హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ డివిజన్ డీఈఈ బి.శ్రీనివాసరావు, విద్యుత్ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.